క్లుప్తంగా

శుభకార్యం



బండి ఆత్మకూరు: మండల పరిధిలోని వెంగళ రెడ్డి పేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు అంబటి ప్రసాద్‌రెడ్డి కుమారుడు మనోజ్‌కుమార్‌రెడ్డి, పల్లె చిన్న రామసుబ్బా రెడ్డి కుమార్తె పుష్పావతిల పెళ్లి నంద్యాల శివా గార్డెన్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. వివాహ వేడుకలకు శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గ సమన్వయ కర్త శిల్పా భువనేశ్ రెడ్డి, బండిఆత్మకూరు ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవ రెడ్డి, సర్పంచ్‌లు పల్లె సోమశేఖర్‌రెడ్డి, బారెడ్డి విజయ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

గణపతి హోమం



గణపతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు, వేదపండితులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో లోకకల్యాణం కోసం సంకటహరచతుర్థిని పురస్కరించుకుని ఆదివారం దేవస్థాన సర్కారీ సేవగా గణపతి హోమాన్ని నిర్వహించారు. ముందుగా సాక్షి గణపతికి విశేష అభిషేకం, అర్చనలు జరిపారు. అనంతరం గణపతి హోమం జరిపించారు. కార్యక్రమంలో స్వామివారి ఆలయ ప్రధానార్చకులు వీరయ్య స్వామి, అమ్మవారి ప్రధానార్చకులు ఉమానాగేశ్వరశాస్త్రి, సీనియర్ వేదపండితులు గంటి రాధకృష్ణశర్మ పాల్గొన్నారు.

సత్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి



నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ ప్రసాదరావు

శ్రీశైలం: కుల సత్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ ప్రసాదరావు సూచించారు. సాయంత్రం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సత్ర నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మల్లన్న దర్శనార్థమై వచ్చిన భక్తులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలన్నారు. సత్రాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకాలాపాలకు తావు లేకుండా చూసుకోవాలన్నారు. మద్యం, మాంసం తీసుకున్న వారిని, జూదం ఆడే వారిని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. భక్తుల రద్దీని ఆసరాగా చేసుకుని గదుల అద్దె పెంచొద్దని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో పాటు తమ సత్రాల్లో దిగిన ప్రతి ఒక్కరి అడ్రస్, ఆధార్ కార్డు నంబర్ నమోదు చేసుకోవాలన్నారు.

పాఠశాలల మూసివేత తగదు

ఎమ్మిగనూరుటౌన్: విద్యాశాఖ సంస్కరణల పేరుతో పాఠశాలలను మూసివేత తగదని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరెక్రృష్ణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజి.వెంకట్రాముడు, గట్టు తిమ్మప్ప అన్నారు. ఏ ఒక్క పాఠశాలను మూసివేయకూడదని, వున్న పోస్టులను రద్దు చేయకుండా వుండాలని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని డీటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలన్నారు. విద్యాశాఖ చేపట్టిన సంస్కరణల్లో ప్రాథమికోన్నత పాఠశాలలు, ప్లస్ టూ పాఠశాలలను రద్దు చేయకూడదని కోరారు. జీఓ నెంబర్ 117ను సంపూర్ణంగా రద్దు చేసి మాతృభాష మాధ్యమాన్ని కొనసాగించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి 12వ పీఆర్సీ కమిషన్ నియమించి మధ్యంతర భృతిని ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ, ఈఎల్‌ల బకాయిలు రూ.21వేల కోట్లను సత్వరం విడుదల చేయాలన్నారు. రెండు విడతల కరువు భత్యాన్ని మంజూరు చేయాలని, క్లస్టర్ల పేరిట మండల విద్యాశాఖ అధికారుల పోస్టులను రద్దు చేసే యోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డీటీఎఫ్ ఉపాధ్యాయ క్రాంతి పత్రిక సంపాదకులు రత్నం ఏసేపు, రాష్ట్ర కౌన్సిలర్లు మోహన్, గోట్ల చంద్రశేఖర్, రవీంద్ర, జిల్లా నాయకులు నాగరాజ్‌గౌడ్, రామన్న, పాటిల్ ఈశ్వర్‌రెడ్డి, వెంకటేషప్ప తదితరులు పాల్గొన్నారు.

రేపు బండలాగుడు పోటీలు

దేవనకొండ: మండలంలోని కొత్తపేట గ్రామంలో మస్తాన్‌వలిబాబా ఉరుసు సందర్భంగా ఈనెల 18న అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు ఆదివారం తెలిపారు. గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.15 వేలు, ఆరో బహుమతి రూ.10 వేలు అందజేస్తామన్నారు.

కంది రైతుకు కష్టాలు!

- అలంకార ప్రాయంగా కొనుగోలు కేంద్రాలు
- దళారులకే విక్రయిస్తున్న రైతన్నలు
- ప్రకటనలకే పరిమితమైన కూటమి ప్రభుత్వం



మూతపడిన రైతు సేవా కేంద్రం



మార్కెట్ యార్డుకు తరలివచ్చిన కందులు

నందికొట్కూరు: కంది రైతులకు కష్టాలు తప్పడం లేదు. రైతు సంక్షేమమే ధ్యేయమని గొప్పలు చెబుతున్న కూటమి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తమ దిగుబడులు విక్రయించుకునేందుకు తంటాలు పడుతున్నారు. ఒక వైపు కూటమి ప్రభుత్వం కేటాయించిన ధర సరిపోక అల్లాడుతుంటే మరో వైపు కొనుగోలు కేంద్రాలు దిగుబడులను కొనుగోలు చేయకుండా వెనక్కి పంపుతున్నారు. అంతర్ పంటలు వ్యవసాయ శాఖ అధికారులు ఆన్‌లైన్‌లో కంది పంట నమోదు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అంతర్ పంటలు సాగుచేసుకుంటే రైతులకు లాభాలు వస్తాయని చెప్పిన అధికారులు ఆన్‌లైన్‌లో ఎందుకు నమోదు చేయలేదని మండిపడుతున్నారు. కొనుగోలు కేంద్రాలు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయకపోవడంతో దళారులను ఆశ్రయించి క్వింటా రూ.6,800లకు విక్రయించాల్సిన పరిస్థితి దాపురించిందని రైతులు వాపోతున్నారు. 20 రోజుల క్రితమే ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆర్భాటంగా ప్రకటించిన కాగితాలకే పరిమితమైంది. ఆన్‌లైన్‌లో పంట నమోదు ఉంటేనే కొనుగోలు చేస్తామని మార్కెఫెడ్ అధికారులు తెగేసి చెబుతున్నారు. రైతులు తమ దిగుబడులను దళారులకు విక్రయిస్తుండటంతో కొనుగోలు కేంద్రాలు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. దళారి వ్యవస్థను నిర్మూలించాల్సిన ప్రభుత్వమే పరోక్షంగా ప్రోత్సహిస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు.

కందులను ప్రభుత్వం కొనుగోలు చేయలేదు



ఈ ప్రభుత్వం కంది పంటను కొనుగోలు చేయడంలేదు. అంతర్ పంటలు వేసుకుంటే మంచి దిగుబడులు వస్తాయని చెప్పిన అధికారులు సాగు చేసిన తర్వాత ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో మార్కెఫెడ్ అధికారులు దిగుబడులను కొనుగోలు ,చేయకుండా వెనక్కి పంపారు. అప్పుల బాధ భరించలేక దళారులకే క్వింటా రూ.6,800 చొప్పున అమ్మేశాం. అంతర్ పంటలు సాగు చేయడంతో ఎకరాకు నాలుగు క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వచ్చింది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కంది రైతులను ఆదుకోలేదు. – ఉపేంద్రారెడ్డి, రైతు

వెనక్కిపంపారు



కూటమి ప్రభుత్వంలో రైతులు వేసిన పంటలు ఆన్‌లైన్‌లో వ్యవసాయ శాఖ అధికారులు నమోదు చేయలేదు. కంది దిగుబడులు మార్కెఫెడ్ కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకెళ్లగా ఆన్‌లైన్‌లో మీ కంది పంట నమోదు కాలేదని వెనక్కి పంపుతున్నారు. ఇంటికి తీసుకెళ్లి దళారులకు రూ.6,800లకే విక్రయించాను. 5 ఎకరాలు కౌలుకు తీసుకున్నా. కౌలు డబ్బు, పెట్టుబడికి కూడా సరిపోదు. అప్పుల ఊబిలో కూరకపోవడం తప్ప చేసేదేమి లేదు. – సుంకన్న రైతు, 10 బొల్లవరం

ఆన్‌లైన్‌లో ఉంటేనే తీసుకుంటాం



ఆన్‌లైన్‌లో నమోదు చేసిన కంది పంటను రైతుల నుంచి కొనుగోలు చేస్తాం. ఆన్‌లైన్‌లో లేకపోతే కొనుగోలు చేయవద్దని ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే కొనుగోలు చేస్తాం. అంతేకానీ మా చేతుల్లో ఏమీ లేదు. – మున్నా, కేడీసీ ఎంఎస్ మేనేజర్

స్తంభాన్ని మార్చండి

ఆత్మకూరు: పట్టణంలోని 2వ వార్డు గాంధీ పార్కు మెయిన్ రోడ్డు పక్కన కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని మార్చాలని వార్డు కౌన్సిలర్ మారబోతుల విజయ్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ స్తంభాన్ని మార్చాలని మున్సిపల్ చైర్‌పర్సన్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అక్కడ రోడ్డులో స్కూల్ బస్సులు, పిల్లలు, పెద్దలు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ప్రమాదకరంగా ఉన్న స్తంభాన్ని మార్చాలని కోరారు.

పెచ్చెరువులో వైద్యశిబిరం, అన్నదానం

ఆత్మకూరు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీశైలం మహాక్షేత్రానికి కాలినడకన వెళ్లే శివస్వాములకు పెచ్చెరువు సమీపంలోని ఫారెస్టు క్యాంపులో అన్నదానం, ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త వెంకటరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకు అనంతపురంలోని ఇస్కాన్ దేవస్థానం కార్యకర్తల ఆధ్వర్యంలో అన్నదానం, వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముగ్గురు డాక్టర్లు, ఎనిమిది మంది నర్సులు, ఏఎన్ఎంలు, రెండు అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచుతామన్నారు. 24 గంటలు అన్నదాన కార్యక్రమం, వైద్యసిబ్బంది సేవలు అందిస్తారన్నారు. ప్రతిరోజూ మల్లన్న, భ్రమరాంబదేవి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి లోటు లేకుండా అన్నదానం నిర్వహిస్తామన్నారు.

నెహ్రూ నగర్‌లో పోలీసుల సోదాలు



గ్రామస్తులకు సూచనలిస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం

పగిద్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్‌లో ఆదివారం నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి సిబ్బందితో కలిసి అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం బస్టాండు ఆవరణంలో సీఐ, ఎస్ఐ ప్రజలతో సమావేశమై చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ కల్పించడమే పోలీసుల కర్తవ్యమన్నారు. శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి, జైలుకు పంపుతామని హెచ్చరించారు. శాంతియుత వాతావరణంలో జీవనం సాగించాలన్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, వేధింపులకు పాల్పడడం, కాలేజ్ స్టూడెంట్స్ పట్ల ఈవ్‌టీజింగ్‌కు పాల్పడం వంటి చట్టవ్యతిరేక చర్యలకు ఎవ్వరు పాల్పడిన ఉపేక్షించేది లేదన్నారు. గ్రామంలో ఏవైనా సమస్యలు తలెత్తితే శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రామంలో ఎవ్వరైన కొత్త వ్యక్తులు అనుమానంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవాలని కోరారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంటుందని రాత్రి వేళలో పోలీస్ గస్తీ కొనసాగుతుందని హెచ్చరించారు. అనంతరం బెల్టుదుకాణాలు నిర్వహిస్తున్న అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేపట్టి హెచ్చరికలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు తిరుపాలు, ఓబులేసు ఉన్నారు.

మానసిక ఆరోగ్యం కాపాడుకోవాలి



మాట్లాడుతున్న వైఎస్సార్ జిల్లా డీఈఓ షంషుద్దీన్

కర్నూలు కల్చరల్: క్లస్టర్ విశ్వవిద్యాలయం పరిధిలోని కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం 21వ శతాబ్దంలో మానసిక సవాళ్లు, పరిష్కారాలు అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. వైఎస్సార్ జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షంషుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మానసిక ఆరోగ్యం అనేది తప్పనిసరిగా ఒక సామాజిక బాధ్యతగా చూడాల్సిన అంశం అన్నారు. సైకాలజీ విభాగం ఇన్‌చార్జ్ విజయలక్ష్మి మాట్లాడారు. అధ్యాపకులు స్రవంతి రెడ్డి, శేషాద్రి నాయుడు, రామకృష్ణ, మాధవరావు, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మత్స్యకారులకు గుర్తింపు కార్డు తప్పనిసరి



మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి

పగిద్యాల: శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో చేపల వేట కొనసాగించేందుకు ఇతర గ్రామాల నుంచి వచ్చిన మత్స్యకారులకు ఆధార్, ఫోన్ నంబర్స్ వంటి గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలని ముచ్చుమర్రి ఎస్ఐ శతర్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని నెహ్రూనగర్ సమీపాన కృష్ణానది పరివాహకం వెంట ఏర్పాటు చేసుకున్న మత్స్యకారుల స్థావరాలను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మత్స్యకారులతో మాట్లాడుతూ వలలు లాగేందుకు వివిధ ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొచ్చి కూలీ డబ్బులు సరిగా ఇవ్వడం లేదనే సమాచారం ఉందన్నారు. వలలు లాగే ప్రతి మత్స్యకారుడికి ఆధార్ కార్డుతో పాటు ఫోన్ నంబర్ తప్పనిసరిగా సేకరించి వారి కుటుంబీకులతో టచ్‌లో ఉండేలా మేస్త్రీలు జాగ్రత్త వహించాలన్నారు. ఆధార్, ఫోన్ నంబర్స్ లేని మత్స్యకార కూలీలను తక్షణమే వారి కూలీ డబ్బు ఇచ్చి పంపివేయాలని హెచ్చరించారు. ఆధార్, ఫోన్ నంబర్స్ లేని ఆరుగురు కూలీలను వారి స్వగ్రామాలకు పంపించాలని మేస్త్రీలకు సూచించారు. ఏ చిన్న ఘటన చోటుచేసుకున్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కార్పొరేట్ శక్తులకు మేలు చేసే కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకించండి



మాట్లాడుతున్న నాయకులు

ఆత్మకూరు: కార్పొరేట్ శక్తులకు మేలు చేసే కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.యేసురత్నం, పట్టణా అధ్యక్షులు సయ్యద్‌మీర్, మండల అధ్యక్షులు రాజమోహన్ రెడ్డి, హంస, యూనియన్ నాయకులు విజయ కుమార్, బీసీ సంఘం అధ్యక్షులు వెంకట స్వామిగౌడ్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం ఎంపీపీ హాల్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. వికసిత్ భారత్–2047 లక్ష్యమంటూ కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2025–26 బడ్జెట్ సంపన్నులకు, కార్పొరేట్ శక్తులకు మేలు చేసేదే తప్పా, సామాన్యులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ మరోసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల ఆశలను అడియాసలు చేసిందన్నారు. విభజన హామీలను పక్కనపెట్టి, రాష్ట్రానికి మొండిచేయి చూపిందన్నారు. విశాఖ రైల్వేజోన్, ఎన్ఐటీ, ఐఐటీ, ఐఐఎం, టిరపుల్ ఐటీ, ఐఐఎస్ఈఆర్, గిరిజన యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీ, దుగ్గరాజపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్, వైజాగ్ స్టీల్ ప్లాంట్, వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, రాజధాని నిర్మాణానికి నిధుల ప్రస్తావనే లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వంపై తిరుగుబాటుకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో నాయకులు మాబాషా, వెంకటేశ్వర్లు, శివుడు, రామ్‌నాయక్, వీరన్న, భాస్కర్, గణపతి, గోర పాల్గొన్నారు.

20 నుంచి మస్తాన్‌వలి ఉరుసు

పాములపాడు: మండలంలోని కంబాలపల్లి గ్రామంలో ఈనెల 20వ తేదీ నుంచి మస్తాన్‌వలి ఉరుసు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ముజావర్ బాదల్లా సాహెబ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ. 20న గంధం, 21న ఉరుసు, 22న జయారత్ ఉంటుందన్నారు. 21న రాత్రి ఖవ్వాలి కార్యక్రమం ఉంటుందన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పాములపాడు: ప్రజలు ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

పాములపాడు: రహదారి నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ సురేష్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక కర్నూల–గుంటూరు ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహన చోదకుల డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహనాల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. ద్విచక్రవాహన దారులు తప్పని సరిగా హెల్మెంట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. పిల్లలు వాహనాలిచ్చే తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు.

విద్యార్థుల బస్సు ఆపాలి

నందికొట్కూరు: ఆర్టీసీ ఆత్మకూరు డిపో విద్యార్థి బస్సులను బ్రాహ్మణకొట్కూరులో ఆపేలా చూడాలని ఎస్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షులు సాయికుమార్ యాదవ్ ఆదివారం ఎస్ఐ తిరుపాల్‌కు వినతి పత్రం అందజేశారు. బస్సులు ఆపకపోవడంతో విద్యార్థులు సమయానికి పాఠశాలలకు వెళ్లలేకపోతున్నారని, ఇదే విషయాన్ని అనేక సార్లు ఆర్టీసీ ఆత్మకూరు డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఎస్ఐకు వివరించారు.

లైంగిక వేధింపుల కేసు నమోదు

నందికొట్కూరు: మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ తిరుపాలు తెలిపారు. ఆదివారం మండలం పరిధిలోని వడ్డేమాన్ గ్రామానికి చెందిన షరీఫాబేగంపై లైంగిక వేధింపులకు పాల్పడిన గొల్ల రామకృష్ణ, వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేశామన్నారు. ప్రైవేట్ వీడియోలు తీసి అందరికీ పంపిస్తామని, తమ కోరిక తీరిస్తే డిలీట్ చేస్తామని బెదరించినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది అన్నారు. విచారణ చేపట్టి ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

మహిళపై దాడి.. ముగ్గురిపై కేసు

బేతంచెర్ల: పట్టణంలోని కోటపేట కాలనీకి చెందిన మహిళను అదే కాలనీకి చెందిన ముగ్గురు దాడి చేసి గాయపరిచారు. పోలీసుల వివరాల మేరకు.. కోటపేట కాలనీకి చెందిన పూసల వెంకటమ్మను అదే కాలనీకి చెందిన సుబ్బమ్మ, మహేష్, బాబు వ్యక్తిగత మనస్పర్థలను దృష్టిలో ఉంచుకుని గొడవ పెట్టుకున్నారు. మాటమాట పెరగడంతో దాడి చేసి గాయపరిచారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప తెలిపారు

16 వాహనాలు సీజ్

కోవెలకుంట్ల: పట్టణంలోని పూసల బజార్‌లో ఆదివారం కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలో రికార్డులు సరిగ్గా లేని 10 ఆటోలు, ఆరు బైక్‌లు సీజ్ చేశారు. అనంతరం కాలనీవాసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు ఎవరైనా కన్పిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. కోవెలకుంట్ల, సంజామల ఎస్ఐలు మల్లికార్జునరెడ్డి, రమణయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



రిషికేష్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: అరుదైన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న బాలుడికి అతని తండ్రి స్నేహితులు ఆర్థిక సాయం అందించారు. పాతమాడుగుల గ్రామానికి చెందిన తెలుగు అశోక్, గంగమ్మ దంపతుల చిన్నకుమారుడు ఐదేళ్ల రిషికేష్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అశోక్.. తన కుమారుడి వైద్యానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు(10వ తరగతి బ్యాచ్) భీస్మాచారి, నంద్యాల నరహరి సత్యం, డాక్టర్ రాము, సంపత్ కుమార్ కర్నూలు విశ్వభారతి క్యాన్సర్ హాస్పిటల్‌కి చేరుకుని చికిత్స పొందుతున్న రిషికేష్‌ను పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.42 వేల ఆర్థిక సాయం చేశారు.

మహానందిలో సండే సందడి



మహానంది: మహానంది ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవురోజు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. అలాగే ఈఓ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరుడి దంపతులకు వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, పండితులు, అర్చకులు నిత్య కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు.



దర్శనం అనంతరం బయటకు వస్తున్న భక్తులు

ఫ్యామిలీ కౌన్సెలింగ్‌లో ఒక్కటైన దంపతులు



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ చంద్రబాబు

ఆత్మకూరు: చిన్నపాటి మనస్పర్థలతో ఏడేళ్లుగా దూరంగా ఉంటున్న దంపతులు ఆదివారం నిర్వహించిన ఫ్యామిలీ కౌన్సెలింగ్‌లో మళ్లీ ఒక్కటయ్యారు. సీఐ చంద్రబాబు తెలిపిన వివరాలు.. కురుకుంద గ్రామానికి చెందిన పుణ్యవతి, సున్నిపెంటకు చెందిన వెంకటకృష్ణకు 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కాగా కుటుంబ కలహాల వల్ల గొడవపడి పుణ్యవతి ఏడేళ్ల క్రితం పుట్టినిల్లు కురుకుందకు వెళ్లిపోయింది. ఇప్పటి వరకు భార్యాభర్తలు కనీసం మాట్లాడుకోలేదు. నెల క్రితం పుణ్యవతి ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తాను, తన భర్త కలిసి ఉంటామని, ఎలాగైనా కలపాలని పోలీసులను అర్థించింది. దీంతో భార్య, భర్తను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి మూడు సార్లు కౌన్సెలింగ్ ఇచ్చారు. చివరగా ఆదివారం రాజీ చేయడంతో దంపతులు ఒక్కటయ్యారు. ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌లో సీనియర్ అడ్వకేట్ నూర్‌అహ్మద్, సీనియర్ లెక్చరర్ హుసేన్, నాగేశ్వరమ్మ, ఐసీడీఎస్ సభ్యులు ఉన్నారు.

ఉత్సవమూర్తులకు విశేష పూజలు



రుద్రవరం: ఉత్సవ మూర్తులు జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాద వరద స్వామి వారికి ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. పార్వేట ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ మూర్తుల పల్లకీ మండలంలోని చందలూరులో వివిధ తెలుపుల మీద కొలువు దీరగా ఆయా తెలుపుల యజమానులు, చుట్టుపక్కల ప్రజలు కాయా కర్పూరాలతో వెళ్లి అర్చకులకు అందించగా వాటిని స్వామివారికి సమర్పించి సెటారుతో భక్తులకు ఆశీర్వచనాలు పలికారు. రాత్రికి స్వామి వారి పల్లకీ చిలుకలూరు గ్రామానికి చేరుకుంది.

పల్లకీని తెలుపుపై కొలువు దీర్చుతున్న బోయిలు